
సాక్షి
పల్నాడు
బుధవారం । 10 । జనవరి । 2024



గోదాదేవికి పుష్పాభిషేకం

తెనాలిటౌన్: పట్టణంలోని జయప్రకాష్‌నగర్ లో వేంకటేశ్వరస్వామి, గోదాదేవికి మంగళవారం కోటిపూలతో పుష్పాభిషేకం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సీఏ ఫలితాల్లో భానుప్రవీణ్‌తేజకు 31వ ర్యాంకు

ఫిరంగిపురం: గుంటూరు జిల్లా గుండాలపాడు గ్రామానికి చెందిన కొల్లి భాను ప్రవీణ్ తేజ మంగళవారం ప్రకటించిన ఆలిండియా సీఏ ఫైనల్ పరీక్షల్లో 31వ ర్యాంకు సాధించాడు. వైఎస్సార్ సీపీ నాయకుడు కొల్లి వీరవసంతరావు, గీతాంజలి కుమారుడు.



న్యూస్‌రీల్

విజయకీలాద్రిని దర్శించిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రాన్ని మంగళవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. వారి రాకను పురస్కరించుకుని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, ఆలయ పండితులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాస్ దంపతులు గోదాదేవిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జస్టిస్ వి.శ్రీనివాస్ దంపతులను జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు సత్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి,అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రూ. 400 కోట్లతో ఎంతో ప్రతిష్టాత్మకంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం స్టాట్యూ ప్రారంభోత్సవం సందర్భంగా లక్షలాదిగా విజయవాడ తరలి రావాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం ఈ కార్యక్రమంలో తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు బోదాల శ్రీనివాసరావు, నలకుర్తి రమేష్ మాల మహానాడు అధ్యక్షుడు నత్తా యానారాజు తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 76,495 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 76,495 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 73,895 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.21,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 22,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 22,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 40,355 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

14 నుంచి ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి సంబరాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 14వ తేదీ ఆదివారం నుంచి సంక్రాంతి సంబరాలను నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. మూడు రోజులపాటు నిర్వహించే సంక్రాంతి సంబరాలలో తొలి రోజైన ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు చిన్న రాజగోపురం వద్ద భోగిమంటలు వేయనున్నారు. అనంతరం హరిదాసుల సంకీర్తనలు, బసవన్నల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. మల్లికార్జున మహా మండపం 7వ అంతస్తు వద్ద బొమ్మల కొలువు ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. సాయంత్రం రాజగోపురం ఎదుట కళావేదికపై గొబ్బెమ్మల ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులకు భోగిపండ్లు పోసే కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, రాజగోపురం, ఇతర దేవాలయాలకు ప్రత్యేక పూల అలంకరణ చేయనున్నారు. ఆలయ ప్రాంగణంలో రంగవల్లులను తీర్చిదిద్ది, తెలుగుతనం ఉట్టి పడేలా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజాసంకల్పం... చరిత్రాత్మకం



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ప్రజాసంకల్పయాత్ర ముగిసి ఐదేళ్లు అయిన సందర్భంగా సత్తెనపల్లిలో సంబరాలు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్ర రాజకీయ చరిత్రలో ఒక చారిత్రాత్మకమైనదని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పేదల కష్టాలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2017 నవంబర్ 6 నుంచి 2019 జనవరి 9 వరకు వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయల నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు దాదాపు 14 నెలలపాటు 3,648 కిలోమీటర్లు ప్రజాసంకల్ప పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు ఫైలుపై తొలి సంతకం పెట్టి అమలు చేశారన్నారు. నాలుగున్నరేళ్లలోనే 99 శాతం హామీలు అమలు చేసి చూపించారన్నారు. ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రానున్న మూడు నెలలే అత్యంత కీలకమని, జగన్ స్ఫూర్తితో సమష్టి కృషిగా పనిచేద్దామన్నారు. పార్టీని విజయతీరాలకు చేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, వ్యవసాయ మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడి రెక్క దేవదాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈనెల 19వ తేదీన జరుగుతుందని, అంబేడ్కర్ వాదులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను మంత్రి రాంబాబు మంగళవారం ఆవిష్కరించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని అన్ని వర్గాలకు రాజ్యాంగబద్ధంగా అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ విగ్రహావిష్కరణ జరుగుతోందన్నారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న ఈ శిల్పం దళిత సామాజికవర్గాలకే కాక రాష్ట్రానికి దిక్సూచీగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, పెండెం బాబురావు, షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, కొర్లకుంట వెంకటేశ్వర్లు, అచ్యుత శివప్రసాద్, చిలుకా జైపాల్, కోడిరెక్క దేవదాస్, జొన్నలగడ్డ ఆనంద్, రేపూడి రవితేజ, నందిగం ఆదాం, సుక్కా మోషే, బండి మల్లికార్జునరెడ్డి, షేక్ మహ్మమద్ గని, తాళ్లూరి మోహన్‌బాబు, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, ఎస్సీ సెల్ నాయకులు, మున్సిపల్, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

అధికారంలోకి రావడమే చంద్రబాబు పరమావధి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: చంద్రబాబు చెప్పేవి ఏమీ చేయడు. ఆయన గతంలో ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటే ఇది తెలిసి పోతుంది. ఏదో ఒక విధంగా అధికారంలోకి రావడమే ఆయన పరమావధి అని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కారెంపూడిలో మంగళవారం జరిగిన పింఛన్ కానుకల పంపిణీ మహోత్సవ సభలో వేలాదిగా విచ్చేసిన పింఛన్‌దారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చంద్రబాబును ఎందుకు నమ్మకూడదో జగనన్న అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందనే విషయాన్ని పీఆర్కే స్పష్టంగా వివరించారు. చంద్రబాబు అధికారం కోసం కుల, మతాలను రెచ్చగొట్టి ప్రభుత్వంపై దుష్ప్రచారాలతో ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పేదలకు మేలు చేసే వాడైతే ఆయన అధికారంలో ఉన్న 14 ఏళ్ల కాలంలోనే చేసేవాడని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న కాపు మిత్రులంతా ఒకసారి ఆలోచన చేయాలని విజ్ఞప్తిచేశారు. వంగవీటి రంగా హత్య దగ్గర నుంచి చిరంజీవిని అవమానించి ఆయన పార్టీని విలీనం చేసే దాకా జరిగిన దుష్ప్రచారం, అలాగే పరిటాల రవి పవన్‌కల్యాణ్‌ను అవమానించారనే దుష్ప్రచారం దాకా చేసిన వారిని కాపులు నమ్మొద్దని, ఇప్పుడు అధికారం కోసం పవన్‌కల్యాణ్‌ని మభ్యపెట్టి భాగస్వామిని చేసుకున్నాడని, పవన్ కల్యాణ్ కూడా తాను ముఖ్యమంత్రి అవుతానని తనకు ఓటేయమని అడగడం లేదని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి ఓటేయమని కోరుతున్నాడని, దీనిని కాపులు గమనించాలని కోరారు. ఏపీలో పార్టీలు, కులాలు, వర్గాలు చూడకుండా సాయం అందలేదనే కుటుంబం ఏ మూలన లేకుండా జగనన్న చేశారని పేర్కొన్నారు. మన సాక్షిగా ఆలోచన చేయండి. మేలు చేశామని నమ్మితేనే సపోర్టు చేయమని జగనన్న అడుగుతుంటే, చంద్రబాబు కుల, మతాలు రెచ్చగొడుతున్నారన్నారని అన్నారు. పింఛన్‌దారులకు పెంచిన పెన్షన్ పంపిణీ చేశారు. మండలంలో వివిధ రకాల పెన్షన్లు పొందుతున్న 7,511 మంది లబ్ధి పొందనున్నారని కొత్తగా మంజూరైన పెన్షన్లు కూడా త్వరలో పంపిణీ అవుతాయని పేర్కొన్నారు. ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం, మాచర్ల మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2400, గరిష్ట ధర రూ.3400, మోడల్ ధర రూ.2900 వరకు పలికింది.

ఆక్వా రైతులకు సర్కారు అండ



జిల్లాలో సాగులో ఉన్న రొయ్యల చెరువులు

- దేశంలో మొదటిసారి ఆక్వాకు ఇన్సూరెన్స్
- ఐదెకరాలలోపు రైతులకు వర్తింపు
- ప్రీమియంలో 20 నుంచి 30 శాతం రాయితీ
- రొయ్య రైతులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అన్నివర్గాల రైతులకు అండగా నిలుస్తున్న వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆక్వా రైతులను కూడా ఆదుకునేందుకు సిద్ధమైంది. ఫిష్ ఆంధ్రా పేరుతో రైతులకు దేశీయ మార్కెట్ సృష్టించే సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎక్కడికక్కడ చేపలు, రొయ్యల వినియోగాన్ని పెంచేందుకు సిద్ధమైంది. ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధుల వల్ల నష్టపోతున్న ఆక్వా రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఇన్స్యూరెన్స్ సదుపాయం కల్పించింది. దేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, గుజరాత్ రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా బీమాను అమలు చేస్తుండటం గమనార్హం.

ఎన్‌ఎఫ్‌డీబీ సహకారంతో...

నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ) హైదరాబాద్, చెన్నై వారి సాంకేతిక సహకారంతో ఆక్వా చెరువులకు ఇన్సూరెన్స్ పథకాన్ని 'పైలట్ ప్రాజెక్ట్'గా అమలు చేస్తున్నారు. ఇందు కోసం ఓరియంటల్, అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను ఎంపిక చేశారు. జిల్లాలోని అర్హత కలిగిన ఆక్వా రైతులు పంట సాగుకు ముందు జిల్లా మత్స్యశాఖ అధికారులను సంప్రదించి బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

ఆక్వాకు వెన్నుదన్నుగా సర్కారు

ఆక్వా సాగుకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వాస్తవానికి ఆక్వా రైతులు ఈహెచ్‌పీ, వైట్‌స్పాట్, వైట్‌గట్టు తదితర వ్యాధులతో సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈహెచ్‌పీతో రొయ్యలో ఎదుగుదల ఆగిపోతుండగా వైట్‌గట్టుతో రొయ్య అన్నవాహిక దెబ్బతింటోంది. ఇక వైట్ స్పాట్‌తో జబ్బుచేసి రొయ్య చనిపోతుంది. వీటితోపాటు విబ్రియో వైరస్‌తో రైతులు నష్టపోతున్నారు. దీంతో రొయ్యల సాగుకు ఇన్సూరెన్స్ కల్పించాలని రైతులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు.

ఏపీ నుంచే అధిక ఎగుమతులు

దేశంలో మన రాష్ట్రం నుంచే అత్యధికంగా ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతుండగా 10.50 లక్షల టన్నులు అమెరికా, జపాన్, చైనా, యూరోప్, మిడిల్ ఏషియాలకు ఎగుమతి అవుతోంది. మిగిలిన 1.5 లక్షల టన్నులు స్థానికంగా అవసరాలకు వినియోగిస్తున్నారు.

ఫిష్ ఆంధ్రాతో స్థానిక మార్కెట్

ఎగుమతులతో నష్టాలు వస్తుండటంతో రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఆక్వాకు మార్కెట్ కల్పించి రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. ప్రధానంగా రొయ్యలు, చేపలను అధికంగా ఉపయోగించేలా ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పిస్తోంది. అందులో భాగంగా మండలస్థాయి నుంచి ఫిష్ ఆంధ్ర పేరుతో ఎక్కడికక్కడ రొయ్యలు, చేపల మార్కెట్లను నెలకొల్పుతోంది. కనీసం ఉత్పత్తిలో 50 శాతం స్థానికంగా ఖర్చయ్యేలా చర్యలు చేపట్టింది. ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 50 మందికి ఇన్సూరెన్స్

ఇప్పటివరకు రొయ్యల రైతులకు ఎటువంటి ఇన్సూరెన్స్ సౌకర్యం లేదు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతోపాటు వివిధ రకాల వ్యాధులతో ఆక్వా సాగుకు అనూహ్యంగా నష్టం జరుగుతోంది. కొన్నిసార్లు పంట పూర్తిగా దెబ్బతింటోంది. రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆక్వా రైతులకు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తాజాగా ఇన్స్యూరెన్స్‌ను అమలు చేస్తున్నారు. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ వారి వద్ద రిజిస్టర్ అయి ఉన్న 2 నుంచి ఐదెకరాలలోపు రైతులు ఇందుకు అర్హులు. జిల్లాలో 7 వేల మందికి పైగా ఆక్వా రైతులు ఉండగా ఐదెకరాల లోపు రైతులు 4,800 మంది ఉన్నారు. పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నందున రాష్ట్రం మొత్తానికి తొలుత 200 హెక్టార్లకు మాత్రమే ఇన్స్యూరెన్స్‌కు అనుమతి ఉంది. ఈ లెక్కన బాపట్ల జిల్లా నుంచి 50 మంది రైతులకు తొలుత ఇన్స్యూరెన్స్ చేసుకొనే అవకాశం లభించింది. మార్చి నెలలోపు ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించాల్సి వుంది. ఎకరాకు రూ.12 నుంచి 15 వేల వరకూ రైతులు ప్రీమియం మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రైతులకు 20 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 30 శాతం రాయితీ కల్పిస్తుంది.

ఆక్వా రైతులకు అండగా నిలుస్తుంది



ఆక్వా రైతులకు ఇన్స్యూరెన్స్ అవకాశం కల్పించాలని చాలా రోజులుగా అడుగుతున్నాం. ఎట్టకేలకు పైలట్ ప్రాజెక్టుగా స్కీం తెచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. ఈ స్కీం వల్ల ఆక్వా సాగు చేస్తున్న మన రాష్ట్ర రైతులకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది. మత్స్యశాఖ ఆక్వా రైతులతో సమావేశాలు పెట్టి అవగాహన కల్పించాలి.

– దుగ్గినేని గోపీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ రొయ్యరైతుల సంఘం

రైతులను ఆదుకునేందుకు ఇన్స్యూరెన్స్



ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం దేశంలో తొలిసారి పైలట్ ప్రాజెక్టుగా ఇన్స్యూరెన్స్‌ను అమలు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధుల వల్ల నష్టం జరిగితే ఇన్స్యూరెన్స్ అండగా ఉంటుంది. 20 శాతం రాయితీతో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. తొలుత జిల్లాలో 50 మంది రైతులకు ఇన్స్యూరెన్స్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. మార్చిలోపు రైతులు స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.


– సురేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి, బాపట్ల జిల్లా

ఎన్నికల సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ



నరసరావుపేట: రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ, సాధారణ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై మంగళవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో ఎస్ఎస్ఆర్–2024, సాధారణ ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలు, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, వారి ఫిర్యాదుల పరిష్కారం, వివిధ ఫారాల పరిష్కారం, ఇంటింటి సర్వే, అనామలీస్, ఫొటో, డెమోగ్రాఫిక్ సిమిలారిటీల పరిష్కారం, స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, డిస్పాచ్, రిసీట్, ట్రైనింగ్ సెంటర్లు, ఎన్నికల సిబ్బంది, శిక్షణ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్పీ సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ కోసం తీసుకున్న చర్యలు, బైండోవర్ అంశాలను వివరించారు.

ట్రాక్టర్, కారు ఢీ.. ఇద్దరు మృతి



మృతుడు ఆంజనేయులు

బల్లికురవ: ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించగా కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన మంగళవారం రాత్రి నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్ రహదారిలోని మండలంలోని కొప్పరపాడు గ్రామంలోని శ్మశానవాటిక సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండ సమీపంలోని గోకనకొండకు చెందిన ట్రాక్టర్ కట్టెలు లోడు చేసుకుని అద్దంకి వెళ్తోంది. ఇదే సమయంలో టీఎస్ 09 ఎఫ్ బీవో 20 కారు హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తోంది. ఈ క్రమంలో కారు ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తూ ఢీకొట్టింది. ప్రమాదంలో హైదరాబాద్ నారాయణగూడకు చెందిన వీనేపల్లి దీపక్‌రావు (41) కారులోనే ఇరుకుని చనిపోయాడు. కారులో ఎవరు లేరు. ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్న వల్లెపు ఆంజనేయులు (20) అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కారు ఢీకొట్టటంతో కట్టెలు కిందపడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బల్లికురవ ఎస్సై వీ.వేమన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కున్న డ్రైవర్ దీపక్ భౌతికకాయాన్ని బయటకు తీసి ట్రాఫిక్ పునరుద్ధరించారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు



నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు

యద్దనపూడి: ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యాన ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ద్వితీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుదే పాండురంగారావు తెలిపారు. మంగళవారం సాయత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో మండలంలోని అనంతవరం గ్రామంలో పోటీలు ఐదురోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటిరోజు తొలి నాటికగా శార్వణి ఫైన్ ఆర్ట్స్ బోరువంక వారి కొత్త పరిమళం, గంగోత్రి పెద్ద కాకాని వారిచే ఆస్తికలు, మైత్రి కళానిలయం విజయవాడ వారి బంధం, 12వ తేదీ మిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారి కన్నీటి కథ, కళాజలి హైదరాబాద్ వారిచే రైతేరాజు, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే జరుగుతున్న కథ, 13వ తేదీ తెలుగు కళాసమితి విశాఖపట్నం వారిచే నిశ్శబ్దమా నీ ఖరీదెంత, ఉషోదయ కళానికేతన్ కత్రపాడు వారిచే ప్రక్షాళన, సుకతి క్రియేషన్ చిలకలూరిపేట మిణుగురు వెలుగులు, 14వ తేదీ న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారి కపిరాజు, రసఝరి పొన్నూరు వారిచే కాపలా, శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారిచే రైతుభారతం, 15వ తేదీ అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే ఇంద్రప్రస్థం, చైతన్య కళా భారతి కరీంనగర్ వారిచే స్వప్నం రాల్చిన అమృతం, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు వారిచే రాత ప్రదర్శన జరుగుతుందన్నారు. తొలిరోజు ముఖ్య అతిధులుగా ఎన్టీఆర్ కళాపరిషత్ ఒంగోలు అధ్యక్షుడు ఈదర హరిబాబు, నాటకరంగ పరిశోధకుడు మన్నే శ్రీనివాసరావు, సినీనటులు రఘుబాబు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జీ తారకరామారావు, నిమ్మల సాంబశివరావు, జయరామకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈనెలలో ఓటర్ల తుది జాబితా



గుంటూరు వెస్ట్: స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా ఈనెలలో ఫైనల్ ఓటర్ల జాబితా విడుదల కానుందని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఓ హోటల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్‌తోపాటు, జిల్లాఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వారం అధికారులు, ప్రజాప్రతినిధులతో ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ఇంటింటి సర్వే, ఎమోగ్రాఫిక్ సిమిలారిటీ, స్వీప్ కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

రైతు నికర ఆదాయం పెంపునకు కృషి

ఆంధ్రప్రదేశ్ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎంవీఎస్ నాగిరెడ్డి

గుంటూరు రూరల్: రైతు నికర ఆదాయం పెంచే దిశగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎంవీఎస్ నాగిరెడ్డి కోరారు. నగర శివారుల్లోని లాం ఫాంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విశ్వవిద్యాలయం 53వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ నికర ఆదాయం పెంచే దిశగా మరొక హరిత విప్లవం రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. వరిలో ఆహార సమృద్ధిని సాధించాం కానీ ఇప్పటికి నూనె గింజలు, అపరాలలో సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మార్కెటింగ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మిరప, పొగాకు వంటి పంటల్లో ఉరకని తట్టుకునే రకాలు ఎంతో అవసరమని సూచించారు. విశ్వవిద్యాలయం వీసీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా తెగుళ్ల తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే 15 నూతన వంగడాలు, 2022లో 19 నూతన వంగడాలు విడుదల చేసినట్లు వివరించారు. పాలకవర్గం సభ్యులు డాక్టర్ మల్లికార్జునరెడ్డి, కోదండరామిరెడ్డి, పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మూడు పబ్లికేషన్స్, ఒక పరిశోధన, విస్తరణ హైలెట్స్, విశ్వవిద్యాలయం పరిధిలో విడుదలైన వివిధ రకాల పుస్తకాలను ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఉత్తమ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంగా తిరుపతికి మొదటి స్థానం లభించగా, ద్వితీయ స్థానంలో గుంటూరు లాంఫాం నిలిచింది. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు కోదండరామిరెడ్డి, బి.శ్రీనివాసులు రెడ్డి, సాయిలక్ష్మి, కోటేశ్వరమ్మ, చింతా ఈశ్వరరావు, మురళీధర్‌రెడ్డి, డాక్టర్ ఎంఎస్ చైతన్యకుమారి, డాక్టర్ పి.గురుమూర్తి, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ డాక్టర్ పి.రాఘవరెడ్డి, మాజీ ఉప కులపతి డాక్టర్ శ్రీరామ్‌రెడ్డి, డీన్ అగ్రికల్చర్ డాక్టర్ రఘురామిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ జీఎంవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు ఆత్మహత్య

పిడుగురాళ్ల: మహిళలను హత్య చేసిన నిందితుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పాతగణేశునిపాడు గ్రామంలో వివాహేతర సంబంధం కారణంగా వజ్రగిరి పాపులమ్మ అలియాస్ జ్యోతిని పాత గణేశునిపాడు గ్రామానికి చెందిన ఢీకొండ కిరణ్‌కుమార్ రొకలి బండతో కొట్టి చంపాడు. అయితే కేసులో నిందితుడు పారిపోయి తిరుగుతుండటంతో పట్టణ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కిరణ్‌కుమార్ (35) పురుగు మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. బంధువులు హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. కిరణ్‌కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు పక్కనే చుక్కల దుప్పి

ప్రమాదంలో మృతి చెందినట్లు ప్రాథమిక నిర్ధారణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నిడమర్రు శిబిరం మధ్య రోడ్డు పక్కనే మంగళవారం ఒక దుప్పి చనిపోయినట్లు స్థానికులు గుర్తించారు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్ట్ డెప్యూటీ రేంజర్ అధికారి పొన్నవాడ గిరిబాబు, ఘటనా స్థలానికి వచ్చి చనిపోయిన దుప్పిని పరిశీలించారు. దుప్పి శరీర భాగాలు విడివిడిగా ఉండడంతో వెంటనే పశువైద్యులు డాక్టర్ శ్రీనివాసరావును పిలిపించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ రేంజర్ పొన్నవాడ గిరిబాబు మాట్లాడుతూ ఎక్కడో ఫారెస్ట్ ఏరియాలో నుంచి తప్పిపోయి చుక్కల దుప్పి ఇటు వచ్చిందని, ఏదో గుర్తుతెలియని వాహనం గుద్దడం వల్ల ఆ దుప్పి రోడ్డుపై ఆ వాహనం ఈడ్చు కెళ్లిందని వివరించారు. పోస్ట్ మార్టం నిర్వహించి డాక్టర్ల నివేదిక వచ్చిన తరువాత పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు. ఫారెస్ట్ గార్డ్ రవికుమార్, వలంటీర్ రమేష్, రహంతుల్లా పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

పోలీసు సిబ్బందికి ఉన్నతాధికారుల సదస్సు



నిబంధనలు వివరిస్తున్న ఏపీపీ బగ్గి నరసింహారావు

నరసరావుపేట: ఎన్నికల సమయంలో పోలీసు అధికారులు పాటించవలసిన నియమ, నిబంధనల గురించి జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ అంశాలపై సత్తెనపల్లి ఏపీపీ బగ్గి నరసింహారావు, అమరావతి సీఐ కె.వి.బ్రహ్మం పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఏ విధంగా చర్యలు తీసుకోవాలి, వారిని చట్ట ప్రకారం ఏ విధంగా నియంత్రించాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏ విధమైన బందోబస్తు నిర్వహించుకోవాలనే అంశాలపై వివరించారు. అలాగే ఈవీఎం బాక్సులు, ఇతర సామగ్రి తీసుకువచ్చి, పోలింగ్ ముగిసిన వెంటనే తీసుకువెళ్లే సమయంలో ఏ విధమైన భద్రత ఏర్పాటు చేసుకోవాలో తెలియ చెప్పారు. ఎన్నికల సమయంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు వాటిని ఏ విధంగా పరిగణనలోకి తీసుకోవాలి, ఆ సంఘటనకు సంబంధించి ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, ఏమైనా అవాంఛనీయ సంఘటనలు ఎదురైనప్పుడు ముందస్తుగా ఎవరికి తెలియపరచాలనే విషయాలపై సిబ్బందికి వివరించారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



సూపర్‌వైజర్లకు తాము విధులకు హాజరవుతామని రాసి ఇస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

అమరావతి: గత 29 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలలో కొందరు మంగళవారం తాము సమ్మె విరమించి విధులలో చేరుతున్నట్లు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చి అంగన్‌వాడీ సెంటర్లను తెరిచారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తమ సమస్యలలో అత్యధిక భాగం ప్రభుత్వం పరిష్కరించిందని, వేతనాలకు సంబంధించిన అంశం కొంత సమయం తర్వాత పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతీదేవి మాట్లాడుతూ అమరావతి సెక్టార్‌లో 33 అంగన్‌వాడీ సెంటర్లు, ధరణికోట సెక్టార్‌లో 31 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయన్నారు. మంగళవారం ధరణికోట సెక్టార్‌లో ఉన్న 31 అంగన్‌వాడీ కేంద్రాలలో నెమలికల్లులో 3 సెంటర్‌లు, ధరణికోటలో 4 సెంటర్‌లు, జూపూడిలో 2 సెంటర్‌లు, అత్తలూరు, మండెపూడిలలో ఒక్కొక్క సెంటర్, మునగోడులో 3 అంగన్‌వాడీ సెంటర్‌లు తెరిచారన్నారు. మంగళవారం తెరిచిన 14 అంగన్‌వాడీ సెంటర్లలో 12 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 11 మంది ఆయాలు లిఖిత పూర్వకంగా తాము విధులలో చేరతామని రాసి ఇచ్చి విధులలో చేరారన్నారు. మరి కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులలో చేరడానికి తమను సంప్రదిస్తున్నారని వారు కూడా బుధవారం విధులలో చేరే అవకాశం ఉందన్నారు.

అక్రమ మద్యంపై అప్రమత్తంగా ఉండాలి

సెబ్ అడిషనల్ ఎస్పీ మొగిలి వెంకటేశ్వరరావు



వివరాలను వెల్లడిస్తున్న వెంకటేశ్వరరావు

ప్రత్తిపాడు: అక్రమ మద్యంపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సెబ్ అడిషనల్ ఎస్పీ మొగిలి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషనులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్రమ మద్యం కేసుల వివరాలను వెల్లడించారు. వట్టిచెరుకూరు, చేబ్రోలు మండలాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమచారం సెబ్ ఉన్నతాధికారులకు అందింది. దీంతో ఈ నెల 8వ తేదీన స్పెషల్ టీంలు ఆయా మండలాల్లో మెరుపు దాడులు నిర్వహించాయన్నారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు మద్యం విక్రయిస్తున్న శివానందను అరెస్టు చేసి అతని నుంచి 55 మద్యం సీసాలు, చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెంలో శ్రీనివాసరావును అరెస్టు చేసి అతని నుండి 10 సీసాలను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈమేరకు వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. గ్రామాల్లో ఎవ్వరయినా అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తే సహించేది లేదన్నారు.
త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సెబ్ టీంలు మరింత యాక్టివ్‌గా పని చేయనున్నాయని వివరించారు. ప్రత్యేక టీంలు ఇకపై గ్రామాల్లో తిరుగుతాయని చెప్పారు. అక్రమ మద్యం విక్రయాలపై తమకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో సెబ్ ఎస్ఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

'మీ గుండె పదిలం' కార్యక్రమానికి అనూహ్య స్పందన



యాంజియోకు సిద్ధమైన వారితో అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా జనవరి 7న పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మీ గుండె పదిలం శిబిరంలో గుండె సంబంధిత వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 30 మందిలో మొదటి విడతగా 16 మంది శాఖమూరి జయమ్మ, షేక్ అబ్దుల్లా, పొన్నూరు లాలు, కనపర్తి మోషె, సొపాటి మరియమ్మ, దేవరపల్లి దానియేలు, తరణి తిరుమలరావు, పొన్నూరు మహాబి, కర్రు కృష్ణ, కర్రు త్యాగయ్య, పఠాన్ హబీబూన్, సొపాటి రాగమ్మ, కోడూరు పద్మావతి, మన్నవ సరోజని, పెరవలి చంద్రశేఖరావు, పరిశ పూర్ణచంద్ర రావులను ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. యాంజియోగ్రామ్ చేయించుకునేందుకు వచ్చిన 16 మందిని ఆయన పరామర్శించారు. శస్త్రచికిత్స, స్టంట్లకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జగనన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా మీ గుండె పదిలం నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపచేస్తూ సకాలంలో వైద్య సహాయం అందజేసేలా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మరిన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. బజరంగ్ బృందం బ్రాహ్మణకోడూరు గ్రామం నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించి, చికిత్సలకు పంపడం జరుగుతోందన్నారు.

తండ్రిని కొట్టి.. రోడ్డున పడేసిన తనయుడు!

- తాడేపల్లిలో పింఛను లాక్కుని.. కన్నతండ్రిని చావబాదిన వైనం
- ఆపై సొమ్మసిల్లడంతో రోడ్డుపై పడవేసి పుత్రరత్నం!
- పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు
- వృద్ధుడిని వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలింపు



నిస్సహాయ స్థితిలో పడి ఉన్న చిన్న మల్లయ్య

తాడేపల్లిరూరల్: కన్నకొడుకు మానవత్వం మరిచాడు. తండ్రి వద్ద ఉన్న పెన్షన్ డబ్బులు లాక్కుని, కొట్టడంతో సొమ్మసిల్లిపోయిన తండ్రిని కనికరం లేకుండా వీధిల్లోకి లాగి పడవేసిన సంఘటన మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం బ్రహ్మానందపురంలో నివాసముండే 85 సంవత్సరాల వయస్సు ఉన్న తాడిపల్ల చిన్నమల్లయ్యకు గత మూడు రోజుల క్రితం వలంటీర్ పింఛన్ అందజేశాడు. నడవలేని మల్లయ్య ఆ డబ్బులను జాగ్రత్తగా ఉంచుకోగా, ఆ డబ్బులు కావాలంటూ కన్నకొడుకు లూర్దురాజు తండ్రిని చితకబాదాడు. ఆ దెబ్బలకు చినమలయ్య తాళలేక ఉన్న డబ్బులను జేబులోంచి తీస్తుండగా మరోసారి తన్నాడు. సదరు డబ్బులు లాక్కుని వెళుతూ.. మళ్లీ కాలుతో ఎగిరెరిగి తన్నడంతో వృద్ధుడు సొమ్మసిల్లిపోయాడు. దీంతో ఇంట్లో నుంచి బయటకు లాక్కొచ్చి రోడ్డుపై పడవేశాడు. స్థానికంగా వున్న కొంత మంది మహిళలు లూర్దును అలా తండ్రిని కొడతావేంటని ప్రశ్నించగా వారిని సైతం కొట్టడానికి వెళ్లడంతో ఆందోళనతో సదరు మహిళలు అక్కడి నుంచి పరారయ్యారు.
స్థానికంగా ఉన్నవారు కొంతమంది వరుసగా తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చిన తరువాత కూడా లూర్దు తండ్రిని నోటికి వచ్చినట్లు బూతులు తిడుతూ పోలీసులకు ఎవరు సమాచారం ఇచ్చారంటూ రోడ్డపై కేకలు పెట్టాడు. పోలీసులు తమదైన శైలిలో లూర్దుకు బుద్ధి చెప్పి గాయపడిన ఆ వృద్ధుడి దగ్గరకు వెళ్లి బయటకు నెట్టివేసిన కన్న కొడుకుతోనే బట్టలు మార్పించి 108లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లూర్దును పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే మల్లయ్య పరిస్థితి బాగోకపోవడంతో లూర్దును విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి అతనితోనే తండ్రికి సేవలు చేయిస్తున్నారు. పోలీసులు వెంటనే స్పందించి కన్న కొడుకుతోనే సేవలు చేయించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి మళ్లీ ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి మళ్లీ ఆశీర్వదించాలని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్ రెడ్డి అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ బ్రోచర్‌ను ఎమ్మెల్యే కాసు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నగర పంచాయతీ పరిధిలో రూ.214 కోట్లు విలువ చేసే నవరత్న పథకాలు ప్రతి ఇంటికీ అందాయని, మరో రూ.110 కోట్ల అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. నగర పంచాయతీలో 3,330 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని, రైతుభరోసా ద్వారా రూ.14,58 కోట్ల లబ్ధి జరిగిందని వివరించారు.
గత టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా రుణాలు రూపాయి కూడా మాఫీ చేయలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.10.70 కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ అయ్యాయని పేర్కొన్నారు. జగనన్న అమ్మఒడి పథకం ద్వారా రూ.17.84 కోట్ల లబ్ధి జరిగిందని, ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు రూ.18.73 నిధులు ఖర్చు చేస్తున్నామని, రూ.15.91 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించామని ఎమ్మెల్యే కాసు వెల్లడించారు. రూ.6.33 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరణ చేశామని, రూ.2.02 కోట్లతో ప్రభుత్వ వైద్యశాలలు అభివృద్ధి చేశామని వివరించారు.

జగనన్న మాట ఇచ్చారు... అమలు చేశారు..

ఇచ్చిన మాట ప్రకారం ప్రతి అవ్వా తాతాకి, ప్రతి అక్క.. చెల్లెమ్మ.. సోదరుడికి..పింఛన్ రూ.3 వేలు జగనన్న అమలు చేసి చూపించారని ఎమ్మెల్యే కాసు చెప్పారు. నగర పంచాయతీ పరిధిలో 4,213 మంది లబ్ధిదారులకు పింఛన్ నగదును ఎమ్మెల్యే కాసు స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్ బాష, కొమెర బత్తిన విజయ్ కుమార్, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్ రెడ్డి, బుర్రి విజయ్ కుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆటో..

ఐదుగురికి గాయాలు



ఘటనా స్థలంలో ఉన్న ఆటో

చినగంజాం: బేల్దారి పనులు ముగించుకొని వస్తున్న ఆటో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఐదుగురు కూలీలు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని జాతీయ రహదారిపై కడవకుదురు హోటల్ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ కే సురేష్ అందించిన వివరాలు.. మండలంలోని పల్లెపాలెం పంచాయతీ తూర్పుపల్లెపాలెం గ్రామానికి చెందిన పది మంది బేల్దారి పని నిమిత్తం ఆటోలో చీరాలకు వెళ్లారు. పనులు చేసుకొని తిరిగి గ్రామానికి పయనం అయ్యారు. ఈక్రమంలో చినగంజాంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేష్ పొలంలో పని ముగించుకుని రోడ్డు మీద ఆపాడు. ఇది గమనించని ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న సింగోతు మాధవి, కొక్కిలిగడ్డ నాగలక్ష్మి, సైకం సుబ్బరావు, సింగోతు రాంప్రసాద్, పాటుపల్లి ఏడుకొండలు గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు 108, హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ అక్కడకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలుకు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

యడవూరు(వేమూరు): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ మంగళవారం విచారణ చేపట్టారు. ఆయన అందించిన వివరాలు.. అమృతలూరు మండలం యడవూరు దళితవాడకు చెందిన కనగాల సురేష్ పొలం కౌలుకు చేస్తున్నాడు. కౌలు పొలంలో నుంచి వరి కోత యంత్రాన్ని తీసుకెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన కుర్రా రమేష్, కుమారులు ప్రయత్నించారు. దీంతో సురేష్ అడ్డగించాడు. దీంతో ఆగ్రహించిన రమేష్, కుమారులు దాడి చేశారు. గాయపడిన సురేష్‌ను 108లో తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. దాడి చేసి, కులం పేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు గ్రామంలో సాక్షులను విచారించి కేసు నమోదు చేశారు. విచారణ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విచారణ మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

ముగిసిన తైక్వాండో పోటీలు

తాడేపల్లిరూరల్: మంగళగిరిలోని ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి, బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ హాజరయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకాలు సాధించిన ధానిష్ హుస్సేన్, ఉజ్వలను, సిల్వర్ మెడల్స్ సాధించిన జ్ఞాన తేజస్వి, హృతి హాసిని, భరద్వాజ్, నిహాన్, కేతన్, శ్రీనివాస్‌లను, జూనియర్ పీవీ విభాగంలో బంగారు పతకాలు సాధించిన వినోద్‌పాల్, అబ్దుల్ రెహమాన్, గీతికలను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సాధించిన సబ్‌జూనియర్ బాయ్స్ అండ్ గరల్స్‌కు ఈనెల 20,21 తేదీల్లో నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటారని గుంటూరు జిల్లా సెక్రటరీ పి.సుబ్బారావు తెలిపారు.